కళాకారుల ప్రదర్శనను విజయవంతం చేయాలి

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కళాకారులకు ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా న్యూక్రియేటివ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో ఈ నెల 8న కల్చరల్ నైట్ ఫుట్ ఎంటర్‌టైన్‌మెంట్ పేరిట నిర్వహించే కళా ప్రదర్శనను విజయవంతం చేయాలని క్రాంతి తెలిపారు. మంగళవారం నగరంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కళాప్రదర్శనలో డ్యాన్స్, సింగింగ్, మిమిక్రీ వంటి కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. ఈ సమావేశంలో చందు, థామస్, సురేష్‌గౌడ్, సాయిబాబు, రాజు పాల్గొన్నారు.




వైభవంగా రథోత్సవం

- హరహర మహాదేవ నామస్మరణతో మార్మోగిన కంఠేశ్వర ఆలయ ప్రాంగణం
- రథోత్సవానికి భారీగా తరలివచ్చిన భక్తులు
- మంగళహారతులతో ఘన స్వాగతం పలికిన మహిళలు
- కోలాహలంగా ఆలయ పరిసర ప్రాంతాలు

7





వసూల్ రాజాలు

- అక్రమ వసూళ్లకు అడ్డాగా రిజిస్ట్రేషన్ కార్యాలయం
- ప్రతీ డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రూ.5000 నుంచి రూ.10వేల వరకు డిమాండ్
- ఒకే డాక్యుమెంట్ పార్టిషన్‌కు ఏకంగా రూ.లక్ష వసూలు
- ప్రైవేటు వ్యక్తి సహకారంతో యథేచ్ఛగా దందా
- ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినా.. ఆగని అక్రమ వసూళ్లు

> జిల్లా రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం అవినీతికి అడ్డాగా మారింది. ఒక్కో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. అధికారులు ఓ ప్రైవేటు వ్యక్తిని మధ్యవర్తిగా నియమించుకుని రిజిస్ట్రేషన్‌దారుల నుంచి అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. కార్యాలయ సిబ్బంది ప్రమేయం లేకుండా సదరు వ్యక్తి ఆ అధికారి పనులను చక్కబెడుతున్నట్లు తెలిసింది. వినియోగదారుల అవసరాన్ని బట్టి వసూళ్లకు పాల్పడుతున్నట్లు రిజిస్ట్రేషన్‌దారులు వాపోతున్నారు.

ఖిల్లా, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రిజిస్ట్రేషన్ శాఖలో దోపిడి పర్వం కొనసాగుతోంది. రిజిస్ట్రేషన్ కోసం వచ్చే వినియోగదారుల నుంచి ముక్కుపిండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వినియోగదారుల అవసరాన్ని అవకాశంగా తీసుకుని అదనపు వసూళ్లకు పాల్పడుతున్నారు. ఒక్కో డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్‌కు రూ.500 ఉండగా.. ప్రస్తుతం డాక్యుమెంట్‌ను బట్టి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు డిమాండ్ చేస్తున్నారు. ఇవి చాలదన్నట్లుగా ఓ అధికారి ఇంకొంచం ముందుకు వెళ్లి ఏకంగా లక్ష రూపాయలు వసూలు చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జిల్లా కేంద్రంలోని వినాయక్‌నగర్‌లో ఓ ప్లాట్‌లో విడివిడి (పార్టిషన్)గా రిజిస్ట్రేషన్ చేయడానికి వినియోగదారుల నుంచి లక్ష రూపాయలు వసూలు చేసినట్లు తెలిసింది. సదరు వ్యక్తి రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి చేసేది లేక లక్ష రూపాయలను ఇచ్చినట్లు సమాచారం. ఈ ఘటన గతనెల 28న నగరంలోని అర్బన్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో చోటుచేసుకుంది. ఈ తతంగం నడిపించడానికి సదరు అధికారి ఓ ప్రైవేటు వ్యక్తిని మధ్యవర్తిత్వం కోసం నియమించుకున్నట్లు తెలిసింది. ఆ వ్యక్తి సదరు వినియోగదారుడిని లక్ష రూపాయలకు ఒప్పించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను కొనసాగించినట్లు సమాచారం. ఇలాంటి రిజిస్ట్రేషన్లు కార్యాలయంలో నిత్యం జరుగుతున్నాయి. గతంలో బై నెంబర్లు వేసి చేసిన రిజిస్ట్రేషన్‌లో పలువురు అధికారులు, ఉద్యోగుల పై కేసు నమోదైన సంఘటనలు ఉన్నాయి. పలు దఫాలు ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించినా.. ఈ దందా మాత్రం ఆగడం లేదు. ఏదో ఒక రూపంలో కొనసాగిస్తూనే ఉన్నారు. డబ్బులు లేనిదే రిజిస్ట్రేషన్ చేయడం లేదు. నేరుగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు వచ్చిన వారికి మాత్రం చుక్కలు చూపిస్తున్నారు. వివిధ డాక్యుమెంట్ల పేర్లు చెప్పి కార్యాలయాల చుట్టూ తిప్పిస్తున్నారు. చివరకు డబ్బులు ఇవ్వందే వారికి కూడా పనులు కావడం లేదు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా.. విచారణ జరిగిన.. పనిచేసిన వారు బదిలీ అయినా అక్రమ వసూళ్ల మాత్రం ఆగడం లేదు.

వసూళ్లకు ప్రయివేటు వ్యక్తి నియామకం..

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయడానికి సదరు అధికారి ప్రైవేటు వ్యక్తిని నియమించుకున్నారు. ఆయన ద్వారా వసూళ్లకు పాల్పడుతున్నట్లు సమాచారం. కార్యాలయ సిబ్బందితో ప్రమేయం లేకుండా సదరు వ్యక్తి ఆ అధికారి పనులను చక్కబెడుతున్నాడు. వినియోగదారుల అవసరాన్ని బట్టి ధరలు నిర్ణయించి వసూళ్లు చేస్తున్నట్లు వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చార్జీలు పెరిగిపోయాయని తమ అవసరాల నిమిత్తం ఆస్తుల క్రయవిక్రయాలు జరుపుకోవడానికి రిజిస్ట్రేషన్ చార్జీలు చెల్లించలేని పరిస్థితిల్లో ఉండగా అదనంగా సబ్‌రిజిస్ట్రార్ వేధింపులు ఎక్కువతున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు..

: రమేష్‌రెడ్డి, (రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ)

రిజిస్ట్రేషన్ల కోసం వచ్చే వారి వద్ద నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై విచారణ జరిపి వినియోగదారులకు అసౌకర్యం కలిగించకుండా చర్యలు తీసుకుంటాం.

వచ్చిన కొత్తలో వివాదాల్లోకి ఆ అధికారి

ఐదు నెలల క్రితం రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీల ప్రక్రియ జరిగింది. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న ఓ జూనియర్ ఉద్యోగి స్థానంలో పూర్తి స్థాయి అధికారిని ఆ శాఖాధికారులు నియమించారు. అయితే వచ్చిన కొత్తలో ప్రతి రోజూ 50కు పైగా రిజిస్ట్రేషన్లు జరిగే స్థానంలో రోజుకు కేవలం పదుల సంఖ్యలోనే రిజిస్ట్రేషన్లు చేసి వివాదాల్లోకి ఎక్కాడు. దీంతో రియల్ ఎస్టేట్ వ్యాపారులు, డాక్యుమెంట్ రైటర్లతో కలిసి వారం రోజుల పాటు పనులు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ వివాదం ఆ శాఖ ఉన్నతాధి వరకు వెళ్లింది. ఆ అధికారి జోక్యం చేసుకుని ఇద్దరిని శాంతింప చేశారు. వారం రోజుల అనంతరం తిరిగి డాక్యుమెంట్ రైటర్లు పనులు చేయడం ప్రారంభించారు. అయినప్పటికీ ఆ అధికారి తన పనితీరును మార్చుకోక ఒక్కో డాక్యుమెంట్‌కు రూ.500 ఉంటే రూ.5వేల నుంచి రూ.10వేలు వసూలు చేయడం మొదలు పెట్టారు. పనులు పూర్తి కావాలంటే ఆ అధికారి చెప్పిందే ఇస్తూ రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఇక్కడి పరిస్థితులను గుర్తించిన సదరు అధికారి ఇష్టానుసారంగా ధరలు పెంచడం ప్రారంభించి ఏకంగా ఒక డాక్యుమెంట్‌కు లక్ష రూపాయలు వసూలు చేయడం గమనార్హం.

జిల్లాలో తగ్గుముఖం పట్టిన భూగర్భ జలాలు

- జిల్లాలో బోర్ల వినియోగంతో నెలలో

1.17 మీటర్లు తగ్గిన నీటి మట్టం

నిజామాబాద్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో భూగర్భజలాలు తుగ్గుముఖం పట్టాయి. పంటల విస్తీర్ణం భారీగా పెరగడంతో సాగునీటి వినియోగం పెరిగింది. బోర్ల వినియోగం ఎక్కువ కావడం ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల నీటి మట్టం తగ్గుతోంది. ఈ మధ్యనే జిల్లాలో వేరువేరు ప్రాంతాల్లో సేకరించిన భూగర్భ జల శాఖ నివేదికలో జలమట్టాల తగ్గుదలపై పొందుపర్చారు.

5లక్షల 46వేల ఎకరాల వరకు సాగు

జిల్లాలో ఈ యాసంగిలో 5లక్షల 46వేల ఎకరాల వరకు పంటలను సాగు చేశారు. వీటిలో దాదాపు 80



శాతం వరకు వరిసాగును చేశారు. జిల్లా వ్యాప్తంగా 96వేల321 వ్యవసాయ బోరుబావుల నుంచి పంటలకు నీటిని వినియోగిస్తున్నారు. రైతుల కోసం త్రీపేజ్ కరెంటును సరఫరా చేస్తుండటంతో పొద్దంతా బోర్ల వినియోగం భారీగా పెరిగింది. శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ఆయకట్టుతో పాటు గుత్ప, అలీసాగర్ ఎత్తిపోతల పథకాల కింద బోర్ల వినియోగం తక్కువగా ఉంది. సరాసరి ఒక్క నెలలోనే 1.17మీటర్ల భూగర్భ జలాలు తగ్గిపోయాయి. జిల్లాలో సరాసరి డిసెంబర్‌లో 8.92 మీటర్ల లోతులో నీళ్ల ఉండగా జనవరిలో 10.09 మీటర్ల లోతుకు పడిపోయాయి. భూగర్భ జల శాఖ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల పరిధిలో 82 బోరు బావుల నుంచి సర్వేను తీసుకున్నారు. ఈ సర్వేలో 10 మీటర్లలోతు నీటిమట్టాలు ఉన్న బోరుబావులు 48 ఉండగా 15 మీటర్ల లోపు ఉన్న 20 బోరుబావులు 15 నుంచి 20 మీటర్ల వరకు ఉన్నాయి. 9 బోరుబావులు 20 మీటర్లపై నీటి మట్టాలు ఉన్నాయి. 5 బోరు బావులు ఉన్నట్లు గుర్తించారు. జిల్లాలో 10 మీటర్ల కంటే తక్కువ నీటి మట్టాలు జిల్లాలోని 59 శాతం విస్తీర్ణంలో ఉన్నట్లు ఆ శాఖ అధికారులు గుర్తించారు. జిల్లాలోని మిగతా ప్రాంతంలో 10 నుంచి 20 మీటర్ల మధ్య 35 శాతం విస్తీర్ణంలో నీటిమట్టాలు ఉన్నట్లు ఆ నివేదికలో పేర్కొన్నారు. 20 మీటర్ల కంటే ఎక్కువ నీటిమట్టాలు 6 శాతం విస్తీర్ణంలో ఉన్నట్లు సర్వే ద్వారా అంచనా వేశారు. జిల్లాలో జనవరి నెలలో నీటి మట్టాలు వినియోగం భారీగా పెరిగినట్లు గుర్తించారు. ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ వరకు భూగర్భ జలాల వినియోగం ఎక్కువగా ఉంటుందని అంచనా వేశారు. భీంగల్, నవీపేట్, డిచ్‌పల్లి, మోపాల్ మండలాల్లోని కొన్ని గ్రామాల పరిధిలో భూముల్లో రాతి పొరలు ఎక్కువగా ఉండటం వల్ల నీటిలభ్యత తక్కువగా ఉన్నట్లు అంచనా వేశారు. జిల్లాలోని రైతులు భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించుకోవాలని భూగర్భ జల శాఖ డీడీ పి.శ్రీనివాస్ బాబు సూచించారు.



క్రీడాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న ఇన్‌చార్జి సీపీ

క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయి

: ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ

ఖిల్లా, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కల్గిస్తాయని ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ అన్నారు. కరీంనగర్‌లో జరిగిన తెలంగాణ రాష్ట్ర 3వ పోలీసు స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025లో పోలీసు కమిషనరేట్‌కు చెందిన 61మంది సిబ్బంది పాల్గొని సత్తాచాటారు. 26 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన క్రీడాకారులకు సీపీ ప్రశంసా పత్రాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ(అడ్మిన్) జి.బస్వారెడ్డి, అడిషనల్ డీసీపీ (ఏఆర్) కే.రామ్‌చందర్, స్పెషల్‌బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాసరావ్, రిజర్వు ఇన్‌స్పెక్టర్ సతీష్, యు.తిరుపతి, ఎంటీవో కె.శ్రీనివాస్, శేఖర్ పాల్గొన్నారు.



పిచ్చిమొక్కలను తొలగించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

మోపాల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచిప్ప గ్రామ సమీపంలోని తండాల్లో రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం చుట్టూ అల్లుకున్న తీగలను ఎట్టకేలకు విద్యుత్ అధికారులు తొలగించారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'విద్యుత్ స్తంభానికి అల్లుకున్న చెట్ల తీగలు' అనే కథనానికి విద్యుత్ అధికారులు స్పందించి పిచ్చిమొక్కలను తొలగించారు. ఇకముందు నుంచి కూడా విద్యుత్ స్తంభం చుట్టూ పిచ్చిమొక్కలు మొలవకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటామని తండావాసులకు అధికారులు భరోసా ఇచ్చారు.

పోలింగ్‌కు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



బోధన్‌లో పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్



ఆరోగ్య కేంద్ర సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు

బోధన్‌రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు అధికారులను ఆదేశించారు. శాసన మండలి, ఉపాధ్యాయ, పట్టభద్రుల నియోజకవర్గ ఎన్నికలను పురస్కరించుకుని కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు మంగళవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పట్ట భద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గాలకు సంబంధించిన వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో ఓటర్ల సంఖ్య గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రతీ పోలింగ్ స్టేషన్‌లో మౌలిక సదుపాయలు కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఆయన వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ విఠల్, ఆర్ఐ వరుణ్, రెవెన్యూ తదితరులున్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్

ఎడపల్లి: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు పరిశీలించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్న ల్యాబ్‌ను పరిశీలించి స్థానికంగా నిర్వహిస్తున్న రక్త పరీక్షలను, కేంద్రానికి వస్తున్న రోగులకు అందిస్తున్న చికిత్సల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి నిత్యం వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ కేంద్రానికి వచ్చే రోగులకు అందుబాటులో ఉండి సేవలను అందించాలని, గర్భిణులకు ఏఎన్‌పీ పరీక్షలు చేయాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ దన్వాల్, మండల వైద్యాధికారి షమిస్తా ఫిర్దోస్, ఆయుష్ వైద్యులు వెంకటేష్ తదితరులు ఉన్నారు.



నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి

రెండో రోజు ఎమ్మెల్సీ స్థానాలకు మూడు నామినేషన్లు

- పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి
- నామినేషన్లను స్వీకరించిన ఎన్నికల రిటర్నింగ్ అధికారి

7

అనుమతుల కోసం ఫేక్ సర్టిఫికెట్లపై విద్యాశాఖ డైరెక్టర్ ఆరా



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు అనుమతుల కోసం ఫేక్ సర్టిఫికెట్లను సృష్టిస్తూ అనుమతులు పొందుతున్నట్లు 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం ప్రచురితమైన కథనానికి రాష్ట్ర విద్యాశాఖ అధికారులు స్పందించారు. నిజామాబాద్ 'ఆంధ్రజ్యోతి'లో అనుమతుల కోసం ఫేక్ సర్టిఫికెట్లు అనే కథనంపై రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ నర్సింహారెడ్డి ఆరా తీసినట్లు తెలుస్తోంది. అనుమతుల జారీ విషయంలో ఫేక్ సర్టిఫికెట్లపై సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆయన విద్యాశాఖ అధికారి అశోక్‌ను ఆదేశించినట్లు సమాచారం. జిల్లాలో అనేక ప్రైవేటు పాఠశాలలు అనుమతుల కోసం ఫేక్ సర్టిఫికెట్లు సృష్టించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రైవేటు పాఠశాలల అనుమతుల కోసం ఇతర పాఠశాలలకు వచ్చిన సర్టిఫికెట్లను మార్ఫింగ్ చేసి అనుమతులు పొందుతున్నట్లు తెలిసింది. అనుమతుల కోసం పెట్టే సర్టిఫికెట్లన్నీ జిరాక్స్ కాపీలే కావడంతో ఇదే అదనుగా నకిలీ సర్టిఫికెట్లను సృష్టిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీనికి మండల విద్యాశాఖ, జిల్లా విద్యాశాఖ సిబ్బంది సహకరిస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో యథేచ్ఛగా సాగుతున్న నకిలీ సర్టిఫికెట్ల వ్యవహారంపై జిల్లా విద్యాశాఖ అధికారులు స్పందించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కేంద్ర మంత్రులు, ఎంపీని కలిసిన బీజేపీ జిల్లా అధ్యక్షుడు

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా రెండో సారి ఎన్నికైన దినేష్ కులాచారి కేంద్ర మంత్రులను మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం ఢిల్లీలోని కేంద్ర మంత్రుల కార్యాలయాల్లో మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లను కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సన్మానించారు. అనంతరం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. రెండోసారి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన కేంద్ర మంత్రులకు, జిల్లా ఎంపీ అర్వింద్‌కు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్‌కు దినేస్ కులాచారి కృతజ్ఞతలు తెలిపారు.



ఎంపీ అర్వింద్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న దినేష్

ఫటా..ఫట్...

మండలంలో 2911 మంది రైతులకు రుణమాఫీ

● జక్రాన్‌పల్లి దేవిక, వ్యవసాయాధికారి



ఆంధ్రజ్యోతి: మండలంలోని 21గ్రామాలకు కలిపి ఎంత మంది రైతులకు రుణ మాఫీ అయ్యింది?

ఏవో: మండలంలో 21గ్రామాల్లో కలిపి 2911మంది రైతులకు రుణమాఫీ అయ్యింది.ఈరైతులకు కలిపి రూ.25కోట్ల 34 లక్షల 61వేల 252లు రుణమాఫీ అయ్యింది.ఇంక రుణమాఫీ కాని రైతుల జాబితాను ప్రభుత్వానికి పంపించాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఎంత మంది రైతులకు రైతు భరోసా వచ్చింది?

ఏవో: ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద మండలంలోని నారాయణపేట్ గ్రామాన్ని ఎంపిక చేసింది. ఈ గ్రామంలో 199మంది రైతులకు ప్రభుత్వం రైతు భరోసాను వేశారు.

ఆంధ్రజ్యోతి: మండలంలోని అన్ని గ్రామాల్లో ఈ యాసంగిలో వరి పంటను ఎన్ని ఎకరాల్లో వేశారు.

ఏవో: మండలంలోని 21గ్రామాలకు కలిపి 18వేల 500ఎకరాల్లో రైతులు వరి పంటను సాగు చేస్తున్నారు. ఎకరాకు 28నుంచి 30 క్వింటాళ్ల ధాన్యం దిగుబడి రానుందని అంచనా వేశాం.

ఆంధ్రజ్యోతి: మండలంలో రైతులు ఎర్రజొన్న పంటను ఎన్ని ఎకరాల్లో వేశారు?

ఏవో: మండలంలోని అన్నిగ్రామాల్లో కలిపి 3400ఎకరాల్లో రైతులు ఎర్రజొన్న పంటను సాగు చేస్తున్నారు.గతఏడాది కంటే ఈ ఏడాది 150ఎకరాల్లో ఎర్రజొన్న పంట సాగు తగ్గింది.ఈ స్థానంలో 150ఎకరాల్లో రైతులు మొక్కజొన్న పంటను సాగు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఈ యాసంగి సాగు పంటలకు ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

ఏవో: మండలంలోని సింగిల్‌విండోలలో, ఫర్టిలైజర్ షాప్‌లో 100మెట్రిక్ టన్నుల యురియా రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఎరువుల కొరత లేకుండా చూస్తున్నాం.

● (ఆంధ్రజ్యోతి,జక్రాన్‌పల్లి)

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఒకరికి మూడు రోజుల జైలు

నవీపేట,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీనగర్‌కు చెందిన కే.శ్రీనివాస్ గౌడ్ అనే వ్యక్తి మూడు రోజుల క్రితం మద్యం తాగి ద్విచక్ర వాహనం నడపగా డ్రంకెన్‌డ్రైవ్‌లో పట్టుబడ్డాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. మంగళవారం అతనిని కోర్టులో హాజరుపర్చగా స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ న్యాయాధికారి నూర్జహాన్ బేగం అతడికి మూడు రోజుల జైలుశిక్ష విధించారని ఎస్‌ఐ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్‌ఐ పేర్కొన్నారు.

చేపల వేటకెళ్లి జాలరి మృతి

నవీపేట,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోస్లీలో ఎడ్ల లింగన్న(52)అనే జాలరి మంగళవారం చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందాడని ఎస్‌ఐ వినయ్ తెలిపారు. లింగన్న తెల్లవారుజామున స్థానిక కాశీరెడ్డి చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడని చెరువు గట్టున దుస్తులు, సెల్‌ఫోన్, చెప్పులు ఉంచి చెరువులోకి వెళ్లాడని అన్నారు. కాళ్లకు వల చుట్టుకోవడంతో అతడు నీటిలో మునిగి మృతి చెందాడని ఎస్‌ఐ వివరించారు. మృతుడికి భార్య వసంత, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారని, భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి ఇద్దరు కుమారులు ఉపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లగా ప్రస్తుతం వారు అక్కడే ఉన్నారని ఎస్‌ఐ వివరించారు.

ఓటరు జాబితాపై అవగాహన

కమ్మర్‌పల్లి,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి):త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మండల పరిషత్ కార్యాలయంలో నూతన ఓటరు జాబితాపై మంగళవారం వివిధ రాజకీయపార్టీ అధ్యక్షులకు కమ్మర్‌పల్లిఎంపీడీవోరాజా శ్రీనివాస్‌అవగాహన కల్పించారు.ఇటీవల నూతనంగా ఓటుహక్కు పొందిన ఓటర్లపేర్లు, ఫొటోలతో సహ ముసాయిద జాబితా సిద్దమయ్యిందని ఇందులో పేర్లుగాని,ఫోటోలుగాని తప్పులుగా ఉంటే అభ్యంతరాలు తెలపాలని ఎంపీడీవో సూచించారు. ఒకవేళ తప్పులుదొర్లితే గుర్తిస్తే ఓటరు జాబితాలో వారి పేర్లను, ఫొటోలను సరిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుంకెట రవి, సీపీఐఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథపార్టీ నాయకులు సారా సురేష్, అధికారులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా మండల పరిషత్ కార్యాలయంలో కొత్త ఓటరు లిస్టుపై మంగళవారం ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో సతీష్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈఓటరు లిస్టుల్లో ఓటర్ల పేర్లు,ఫొటోలు, తప్పులు, ఒప్పులు ఉంటే అభ్యంతరాలు తెలపాలని ఎంపీడీవో ప్రజాప్రతినిధులకు సూచించారు. తప్పులుఉన్న ఓటరు జాబితాలో వారి పేర్లను ప్రభుత్వం సరిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మండల బీజేపీ అధ్యక్షుడు కన్నెపల్లి ప్రసాద్, ప్రజాపంథ నాయకుడు బి.గంగాధర్, అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబా ఆలయంలో చోరీ

ఎడపల్లి,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):ఎడపల్లి మండలంలోని బాపునగర్ గ్రామంలో గల శ్రీ షిర్డీ సాయిబాబా ఆలయంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు తాళం పగుల గొట్టి ఆలయంలో ఉన్న హుండీని ఎత్తుకెళ్లారు. ఉదయం పూజారి ఆలయానికి వచ్చి చూడగా ఆలయం తాళం పగుల గొట్టి ఉండడం, ఆలయంలో హుండీ లేకపోవడంతో గ్రామస్థులకు సమాచారం చేరవేశారు. దీంతో గ్రామస్థులు చుట్టు ప్రక్కల వెతకగా హుండీని పగుల గొట్టి ప్రక్కనే ఉన్న పొలంలో పడేశారు. ఇది గమనించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారు.

జోగిని, ఒంటరి మహిళలకు ఆరు గ్యారెంటీల్లో ప్రాధాన్యం ఇవ్వాలి



ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌రూరల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటిల్లో జోగిని ఒంటరి మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని బహుజన లెఫ్ట్ మహిళ సంఘం రాష్ట్ర కన్వీనర్ సబ్బని లత డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం కోసం దరఖాస్తు చేసుకున్న జోగిని కుటుంబాలకు గ్రామాల వారీగా ప్రత్యేకంగా గుర్తించి ప్రతీ జోగిని కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.10లక్షలు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగ నియమకాల్లో జోగి కుటుంబ సభ్యులకు అవకాశాలు కల్పించాలని, విద్యార్హత లేని కుటుంబానికి స్వయం ఉపాధి పథకంలో భాగంగా జోగిని మహిళ కుటుంబాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన నిమిత్తం రూ.25లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. అలాగే మూడు ఎకరాల వ్యవసాయ భూమిన, రేషన్‌కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వారు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు విమల, ప్రమీల, శంకర్, బోజమ్మ, వివిధ మండలాలకు చెందిన ఒంటరి మహిళలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైంది

● పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి



గంగాధర్ దంపతులను సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

కోటగిరి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని అంకితభావంతో విధులు నిర్వహించిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి పేర్కొన్నారు. కోటగిరి మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులు గంట్ల గంగాధర్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు ముఖ్యఅతిథిగా హాజరై గంగాధర్ దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గంగాధర్ అంగవైకల్యాన్ని జయించి సుమారు 40 ఏళ్ల పాటు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం అభినందనీయమన్నారు. ఎంతో మంది విద్యార్థులను భావి పౌరులుగా తీర్చిదిద్దడంలో గంగాధర్ చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. అటు ఉపాధ్యాయునిగా ఇటు పీఆర్టీయూ యూనియన్‌లో తనవంతు సేవలు కొనసాగించి అందరికీ ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. అనంతరం పీఆర్టీయూ యూనియన్ నాయకులు, తోటి ఉపాధ్యాయులు, గ్రామస్తులు గంగాధర్ దంపతులను ఘనంగా సన్మానించారు.

● ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల సాధనకు అవసరమైతే ఉద్యమిస్తాం

కోటగిరి: ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లుల సాధనకై అవసరమైతే మరోమారు ఉద్యమిస్తామని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు మోహన్ రెడ్డి హెచ్చరించారు. కోటగిరి మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల డిఏ బిల్లులను ఇవ్వడంలో తీవ్ర జాప్యం చేస్తుందన్నారు. పదవి విరమణ ప్రయోజనాలు, జీపీఎఫ్, డీఏ, పీఆర్సీ సరెండర్ లీవ్స్, మెడికల్ బిల్స్ విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. గత ప్రభుత్వంలో తాము తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని గుర్తు చేశారు. ఉపాధ్యాయుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప్రభుత్వం 2 శాతం ఓట్లతో అధికారం కోల్పోయింది అన్నారు. ప్రస్తుత ప్రభుత్వం తమ పట్ల అదేవిధంగా వ్యవహరిస్తే ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉన్న పెండింగ్ బిల్లుల విషయంలో జాప్యం చేయకుండా మానవతా దృక్పథంతో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిఆర్‌టియు నాయకులు కిషన్, ఇల్తెపు శంకర్, ఎంఈఓలు శ్రీనివాస్‌రావు, శంకర్, పీఆర్టీయూ నాయకులు బర్ల సాయిలు, ఉదయ్ చందర్, గంగారాజు, శానం సాయిలు, సుధీర్, హర్షద్ హుస్సేన్, రవీందర్, కృష్ణమోహన్,రాజు పాల్గొన్నారు.

బాలికలు తమ హక్కులు, చట్టాల పట్ల అవగాహన పెంచుకోవాలి

కమ్మర్‌పల్లి, ఫిబ్రవరి 4: బాలికలు తమ హక్కులు, చట్టాల పట్ల అవగాహన కల్పించుకోవాలని సీడీపీవో స్వర్ణలత అన్నారు జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం కమ్మర్‌పల్లి మండలం ఉప్లూర్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా బాలికల హక్కులుచట్టాలపై అవగా కల్పించారు అనంతరం మాట్లాడుతూ..బాలికలు ఉన్నత స్థాయికి ఎదగడానికి ప్రభుత్వం అందించే సౌకర్యాలు ఉపయోగపడతాయనిఅన్నారు. బాల్యవివాహాలు, పీవోసీఎస్‌వో చట్టాలు, హెల్ప్‌లైన్, లింగ వివక్షతను రూపుమాపాలని పిలుపునిచ్చారు. ఆడపిల్లల ప్రాముఖ్యత, గుడ్‌టచ్,బ్యాడ్‌టచ్, పిల్లలపై సోషల్ మీడియా ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి బహుమతులును అందజేశారు. అనంతరం విద్యార్థినిలతో పాఠశాల ఆవరణలో మొక్కలు నాటించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో జ్ఞానేశ్వరి, సూపర్ వైజర్లు గంగహంసా, డిహెచ్ఈవో సౌమ్య,ఐసీపీఎస్ సునీత, అంగన్ వాడి టీచర్లు పద్మ,శోభ, సరిత,లక్ష్మీ కౌసల్య, పాఠశాల హెచ్ఎం రాజన్న, ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సీడీపీవో స్వర్ణలత

పిల్లలకు ప్రతీరోజు పౌష్టికాహారాన్ని అందించాలి

వేల్పూర్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని ప్రతీరోజు పిల్లలకు తప్పనిసరిగా అందించాలని ఎంపీడీవో బాలకిషన్ అన్నారు. మంగళవారం వేల్పూర్ మండలం లక్కోర గ్రామంలో అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రానికి ప్రభుత్వం ద్వారా వచ్చే వివిధ సరుకుల స్టాక్‌ను, పిల్లల హాజరుపట్టికను వివిధ రికార్డులను ఎంపీడీవో బాలకిషన్ పరిశీలించారు. ప్రభుత్వ మెను ప్రకారం పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారాన్ని అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి విజయ్, అంగన్‌వాడి టీచర్‌లు, తల్లులు, తదితరులు ఉన్నారు.

ఆర్మూర్‌టౌన్: మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో అంగన్‌వాడి కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ రాజు పరిశీలించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడి కేంద్రాల్లో బాలింతలు, గర్భిణీలకు, మూడేళ్ళ లోపు పిల్లలకు పాలు, గుడ్లుతో పాటు రేషన్ తప్పకుండా అందించాలని అంగన్‌వాడి టీచర్‌లకు సూచించారు. మూడేళ్ళ పైబడిన పిల్లలకు మానసిక, శారీరక పెరుగుదలకు అవసరయ్యే చర్యలు తీసుకుంటూ పౌష్టికాహారాన్ని అందించాలని ఆయన సూచించారు. ఆయన వెంట మున్సిపల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి: బెటీ బచావో బేటీ పడావో కార్యక్రమం పదేళ్లు పూర్తయిన సందర్భంగా జక్రాన్‌పల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మంగళవారం అధికారులు ఉత్సవాలు నిర్వహించారు. గర్భిణీలు, బాలింతలకు మంచి పౌష్టికాహారం అందించాలని, బాల్యవివాహాలు చేయవద్దని, ప్రొజెక్టర్ ద్వారా ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడి టీచర్‌లకు గర్భిణీలు, బాలింతలకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సతీష్‌కుమార్, మండల ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి, అంగన్‌వాడి టీచర్‌లు, తదితరులు పాల్గొన్నారు.



పెర్కిట్‌లోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రాజు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని అంగన్‌వాడి కేంద్రంలో సూపర్‌వైజర్ వెంకటరమణమ్మ ఆధ్వర్యంలో మంగళవారం పిల్లలకు అక్షరభ్యాస కార్యక్రమం నిర్వహించారు. మూడేళ్ళ లోపు పిల్లలకు బాలమృతంతో పాటు పౌష్టికాహారాన్ని అందజేశారు. గర్భిణీ, బాలింతలకు ఆరోగ్య విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు ఎస్తెర్ రాణి, చిన్నారుల తల్లులు, తదితరులు పాల్గొన్నారు.

నందిపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కును అందజేస్తున్న కాంగ్రెస్ మండల నాయకులు

నందిపేట,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మంగళవారం బాధిత కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మంద మహిపాల్ అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు ఏశాల లింగంకు రూ.60వేలు, జూలరు కుంబాయికి రూ.16వేలు, జైనోద్దిన్‌కు రూ.13వేల500 చెక్కులను ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం పంపిణి చేశారు. సీఎంరిలీఫ్ ఫండ్ చెక్కుల మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆర్మూర్ నియోజక వర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దమ్మాయి శ్రీను, ఇసూబ్, కాంతం చిన్నయ్య, షైమద్, జమీల్, ఎడ్డిగారి నిఖీల్, కాల భోజన్న, నడ్కుడ భూమన్న, జూల రాజేందర్, చాకలి గంగన్న, మేర శ్రీను తధితరులు ఉన్నారు.

బోధన్ ఆర్య సమాజ్‌లో వివాహం

బోధన్‌రూరల్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఆర్యసమాజంలో న్యాయ సహాయ కేంద్రం కమ్యూనిటీ మిడిరేషన్ సెంటర్ శక్తి సదన్ సదర్ హోం ఆధ్వర్యంలో బోధన్ పట్టణంలోని ఆర్యసమాజ్‌లో ప్రేమవివాహం జరిపించినట్లున్యాయసహాయ కేంద్రం కమ్యూనిటీ మిడిరేషన్ పద్మసింగ్‌తెలిపారు. అక్షయ,భాస్కర్‌లు ఇష్టపూర్వకంగా పెళ్లికి ఒప్పుకోవడంతో ఆర్యసమాజ్‌లో పెళ్లి చేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐగంగాధర్,పద్మసింగ్, సుజాత, రూప, శక్తిసదన్ సిబ్బంది, ఆర్యసమాజ్ నిర్వాహకులు అశోక్, మాధవిలత, కొత్త రాజేశ్వర్, ఇరుపక్షాల కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజుకు చేరిన శత చండీయాగం

నందిపేట, ఫిబ్రవరి 04 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌడమ్మ కొండూర్ గ్రామంలో గ్రామాభివృద్ది కమిటీ, ఆలయ కమిటీ సంయుక్తంగా నిర్వహిస్తున్న శత చండియాగం ఉత్సవాలు రెండవ రోజుకు చేరుకున్నాయి. మంగళవారం గ్రామస్తులు దంపతులతో సహ పెద్ద ఎత్తున యజ్ఞం నిర్వహించారు. ముందుగా గణపతి పూజ, పంచ మండప ఆరాధన, లలిత సహస్ర పారాయణం, విగ్రహాలకు పంచామృత అబిషేకం, మహా పూజ, మహా హరతి, తీర్థ ప్రసాద వితరణ, అన్నదం జరిగింది. ముందుగా భక్తులు చౌడేశ్వరీ ఆలయంలో ప్రత్యేక పూజలు, అబిషేకాలు నిర్వహించారు. సుమారు వారం రోజుల పాటు శత చండియాగం, కుంభాభిషేకం మహోత్సవాలు జరుగుతా యని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటీసీ సభ్యురాలు డి రాజు, నాయకులు దేవిదాస్, సాయి, మహేందర్, రాజు, గ్రామస్తులు తధితరులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

భీమ్‌గల్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణ కేంద్రంలోని పాత పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ పార్కులో మొక్కలను సంరక్షించాలని మున్సిపల్ కమిషనర్ గంగాధర్ సిబ్బందికి వివరించారు. మంగళవారం పట్టణంలో జరుగుతున్న సానిటేషన్ పనులను, పార్కును శుభ్రం ఉంచి మొక్కలను రెండు సార్లు నీరు అందించాలని, వార్డుల్లో చెత్తసేకరిస్తున్న వాహనానలు ఆయన పరిశీలించి డ్రైవర్‌లకు సూచనలు చేశారు. ఆయన వెంట వార్డు ఆఫీసర్‌లు నవీన్, శ్రీకర్, ఇన్‌చార్జీ సానిటరీ ఇన్స్‌పెక్టార్ ఓంకార్, రాజయ్య, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పంట వివరాల నమోదు ప్రక్రియ పరిశీలన

వేల్పూర్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం మంగళవారం ప్రారంభమైన పంట వివరాల నమోదు ప్రక్రియను మండల వ్యవసాయాధికారిణి ఎస్.శృతి పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యాసంగిలో పంటల వివరాల నమోదు ప్రక్రియ మండలంలోని ప్రతీ గ్రామంలో ప్రారంభమైందన్నారు. రైతులందరు యాసంగిలో వేసిన పంటలను సర్వే నెంబర్ వారిగా ఏరకమైన పంటలు వేశారో సంబంధిత విస్తీర్ణ అధికారి వద్ద నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ పంట నమోదు ప్రక్రియ రైతులు సహకరించాలన్నారు.ఈకార్యక్రమంలో ఏఈవో తిరుమల, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మాల మహానాడు నాయకుల ముందస్తు అరెస్టు

రుద్రూర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణపై హైదారాబాద్‌లో జరిగే కార్యక్రమానికి మాల మహానాడు నాయకులను వెళ్లనివ్వకుండా మంగళవారం ఉదయం రుద్రూర్ మండల మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.మాల వర్గాలు ఎక్కడ ఎస్సీ వర్గీకరణను అడ్డుకుంటారోనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్ మండల పలు గ్రామాల అంబేద్కర్ యువజన, మాల ఉద్యోగ సంఘాల నాయకులను, మాల మహానాడు నాయకులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారన్నారు. ఈ అక్రమ అరెస్టులు సిగ్గు చేటని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలకు మాల సంఘాల ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. అరెస్టు చేసిన వారిలో కిషోర్, నవీన్, గౌతమ్ తదితరులు ఉన్నారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నాగ సురేష్

నందిపేట,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): నందిపేట మండల కేంద్రానికి చెంది న నాసురేష్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా నియమితులైనారు. విద్యార్థి దశ నుంచి విద్యార్థి పరిషత్‌లో అనేక సంవత్సరాల పాటు పని చేసిన నాగ సురేష్ విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. అంతే కాకుండా బీజేపీ యువ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రస్తుతం పని చేస్తున్నారు. అన్ని విషయాలలో సమర్థవంతంగా పని చేయడంతో అధిష్టానం గుర్తించి నాగ సురేష్‌ను బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా ఎంపిక చేశారు. ఈ ఎంపికకు కృషి చేసిన నిజామాబాద్ పార్లమెంటు సభ్యులు ధర్మపురి అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు చైర్మెన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు కులచారి దినేష్‌కు నాగ సురేష్ కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోస్టుఇవడంతో నందిపేట మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్లాస్టిక్ వినియోగంపై అధికారుల తనిఖీలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలోని పలు షాప్‌లలో మంగళవారం మున్సిపల్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ రాజు ఆదేశాల మేరకు పలు హోటళ్లు, బేకరీలు, ఫస్ట్ ఫుడ్ సెంటర్‌లలో తనిఖీలు నిర్వహించి ప్లాస్టిక్ వాడుతున్న పలు దుకాణ యజమానులకు జరిమానాలు విధించారు. అలాగే ట్రేడ్ లైసెన్స్ లేని దుకాణ యాజమానులకు నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంఓ మున్సిపల్ సానిటరీ ఇన్స్‌పెక్టార్ గజానంద్, పర్యవరణ ఇంజనీర్ పూర్ణ మౌళి, వార్డు ఆఫీసర్ పృధ్వీరాజ్, మున్సిపల్ సిబ్బంది అక్షయ్, రాము, తదితరులు పాల్గొన్నారు.

మహిళ సంఘాల ఏర్పాటులో ఆర్‌పీలు ముందుండాలి

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ పరిధిలో మహిళ సంఘాల ఏర్పాటు మెప్మా ఆర్‌పీలు ముందుండాలని మున్సిపల్ కమిషనర్ రాజు తెలిపారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ మహిళ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌పీలను వార్డుల వారీగా విభజించి ఇంటింటి సర్వే చేయాలని ఆదేశించారు. ఆసక్తి గల మహిళలు ఆర్‌పీల ద్వారా స్వయం సహాయక సంఘాల్లో చేయాల్సిందిగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, సీవో రాజలింగం, తదితరులు పాల్గొన్నారు.

పట్టణ వాసులు సకాలంలో పన్నులు చెల్లించాలి

● బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో



పన్నుల వసూళ్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణ వాసులు, వాణిజ్య, దుకాణ సముదాయదారులు సకాలంలో మున్సిపాలిటీకి చెల్లించాల్సిన పన్నులు చెల్లించి బోధన్ పట్టణ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మంగళవారం పన్నుల వసూళ్ల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశారు. బృందాలుగా ఏర్పడ్డ మున్సిపల్ సిబ్బంది పన్నుల వసూళ్ల కోసం ఇంటింటికి వెళ్లి పన్నులు వసూలు చేశారు. బోధన్ మున్సిపల్ అడిషనల్ కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు పన్నుల వసూళ్లలలో వేగం పెంచాలని ఆయన సూచించారు. ఈ నెలాఖరుకల్లా వందశాతం పన్నులు వసూలు అయ్యేలా చూడాలన్నారు. దుకాణ యాజమానులు, బడాబాబులు తమ ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి పట్టణ అభివృద్ధికి సహకరించాలన్నారు. లేని యెడల మున్సిపల్ నియమ నిబంధనలను అమలు చేయాల్సి వస్తుందన్నారు. పలు చోట్ల మున్సిపల్ కమిషనర్ స్వయంగా ఇంటింటికి వెళ్లి పన్నుల వసూలు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకట నారాయణ, మున్సిపల్ సిబ్బంది తదితరులున్నారు.

ప్రజలకు సేవ చేయడానికి అందుబాటులో ఉండాలి

● యూపీహెచ్‌సీ కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎంఅండ్‌హెచ్‌వో



రిజిష్టర్‌ను తనిఖీ చేస్తున్న దృశ్యం

ఆర్మూర్‌టౌన్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి) ప్రతీరోజు ప్రజలకు సేవ చేయ డానికి పీహెచ్‌సీ కేంద్రాల్లో సిబ్బంది అందుబాటులో ఉండాలని డీఎంఅండ్ హెచ్‌వో రాజశ్రీ అన్నారు. మంగళవారం పట్టణంలోని యుపీహెచ్‌సీ కేంద్రాన్ని ఆమె తనిఖీ నిర్వహించి హాజరు రిజిష్టర్‌ను తనిఖీ చేసి కోల్డ్ చైన్ అండ్ వ్యాక్సినేషన్ ఈడీడీలను అడిగితెలుసుకు న్నారు. అందుబాటులో ఉన్నముందుల వివరాలను తెలుసుకొని ప్రతీరోజు సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవలందిం చాలని ఆమెసూచించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ ఫాతి మఫిర్దోస్, సిబ్బంది ఆనంద్, కృష్ణ, సురేష్, పాల్గొన్నారు.

మద్దెపల్లికి జిల్లా సామాజిక తనిఖీ బృందం



పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

నవీపేట,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి పోషణ అభియాన్ పథకం కింద ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం అమలును మంగళవారం జిల్లా సామాజిక తనిఖీ ప్రత్యేక బృందం సభ్యులు పరిశీలించారు. మండలంలోని మద్దెపల్లి తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల, యంచ యూపీఎస్ పాఠశాలలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి స్వయంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం పాఠశాలల ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బృందం సభ్యులు నగేష్, మోహన్ రావు, సుమలత, ఎంఈవో అశోక్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అరుణ, శ్రీనివాస్ తదితరులున్నారు.

కన్యకా పరమేశ్వరి స్థిర ప్రతిష్ఠాపన

దోమకొండ,(బీబీపేట)ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):బీబీపేట మండల కేంద్రంలో వాసవీ కన్యకా పరమేశ్వరి స్థిరప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం మంగళవారం నుంచి శుక్రవారం వరకు నిర్వహించడం జరుగుతుందని ఆర్యవైశ్య సంఘం బీబీపేట సభ్యులు తెలిపారు. నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకా పరమేశ్వరి గణపతి, ఆంజనేయ, నవగ్రహదేవి దేవతల స్థిర ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు.దేవతామూర్తులను గ్రామంలో ఊరేగించారు.5న బుధవారం గురువందనం,గోపూజ, గణపతిపూజ, పుణ్యవచనము, 6నగురువారం స్థాపిత దేవతాపూజ, జలధివాసాంగ హోమం, తీర్థప్రసాద వితరణ, 7న శుక్రవారం విగ్రహ స్థాపన, ప్రాణపతిష్ఠ, నేత్రోన్మీలినము, అన్నదానం, తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని సభ్యులు బాశెట్టి నాగేశ్వర్, ప్రసాద్, రాజు,చరణ్, వెంకటేష్ తెలిపారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

దోమకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో వీరబ్రహ్మేంద్ర స్వామి ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం వరకు ప్రతిష్టాపన ఉత్సవాలు జరుపబడతాయని కమిటీ సభ్యులు తెలిపారు. మంగళవారం నిత్య బలిహరణలు, ఆశీర్వచనము, 5న హోమము, ధాన్యాధివాసము, 6న గణపతి పూజ, 7న ఓడిబియ్యం, అన్నదానం, 8న స్వామివారి ఊరేగింపు, 9న పోలేరమ్మకు బోనాలు సమర్పణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కంది గంగాధర్, కంది రాజయ్య, పండరి, శ్రవణ్, ముత్యం, శ్రీనివాస్, లింబాద్రి, స్వామి, ప్రభాకర్, ఆనంద్, అమర్‌నాథ్, వినోద్, కమ్మరి శ్రీనివాస్, విశ్వబ్రహ్మణ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

'భవన నిర్మాణ పనులను నిలిపివేయాలి'

దోమకొండ, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో చేపడుతున్న షెటర్ల నిర్మాణం పనులు నిలిపివేయాలని మంగళవారం దోమకొండ అఖిలపక్షం నాయకులు అన్నారు. ఎంపీడీవోతో నాయకులు సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంపీడీవో ఆవరణలో ఖాళీ స్థలం లేకుండా పోతుందని అట్టి పనులు నిలిపివేయాలన్నారు. ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిధులు ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు ప్రారంభించడం జరిగిందని అఖిల పక్షం నాయకులు నిలిపివేయాలని తమ దృష్టి కి తెచ్చినందున పనులు అపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అఖిలపక్షం నాయకులు పాల్గొన్నారు.

డ్రింకింగ్ వాటర్ స్పెషల్ డ్రైవ్

సదాశివనగర్,ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మోజీవాడి, తుక్కోజీవాడి, వజ్జెపల్లి,దగ్గి గ్రామాలలో ఎంపీడీఓ సంతోష్‌కుమార్, మండల ప్రత్యేకాధికారి చందర్‌నాయక్ మంగళవారం డ్రింకింగ్ వాటర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామాలలో అన్నివీధులు, వాటర్ ట్యాంక్స్ తిరిగి పరిశీలించడం జరిగిందని తెలిపారు.నర్సరీ, పల్లె ప్రకృతి వనమును శుభ్రపరచడం, మొక్కలకు వాటరింగ్ చేయించడం గురించి పంచాయతీ కార్యదర్శులకు వాటర్‌మెన్‌లకు తగు సూచనలు చేశారు. ప్రతివారం వాటర్ ట్యాంకులు శుభ్రం చేస్తు వీధులను ఎప్పటికప్పుడు ఊడిపించి చెత్త సేకరించి డంపింగ్ యార్డ్‌లకు తరలించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీఓ, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసు, అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో కందకాలు

రాజంపేట, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి): రాజంపేట మండలంలోని శేర్‌శంకర్ తండా గ్రామంలో మంగళవారం ఎల్లారెడ్డిపల్లి బీట్ రిజర్వ్ ఫారెస్ట్ క్యాంప్ నంబర్ 677వద్ద ఆక్రమించిన అటవీభూమిని పోలీసు, అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో కందకాలు తీయడం జరిగిందని ఎఫ్‌డీఓ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్దిరోజుల క్రితం అటవీ అధికారులపై దాడిని దృష్టిలో ఉంచుకుని జిల్లా అటవీసిబ్బంది పోలీసుల సహకారంతో గుంతలు, కందకాలు సుమారుగా 60 ఎకరాల విస్తీర్ణంలో తీయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారులు రమేష్,సంతోష్,ఓంకార్, భిక్కనూరు సీఐ సంపత్‌కుమార్, ఎస్‌ఐ పుష్పరాజ్,అటవీసిబ్బంది,పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.


ఆటపాటలతో రథం ఊరేగింపును నిర్వహిస్తున్న మహిళా భక్తులు




మమ్ము దీవించు స్వామి


నీలకంఠేశ్వర స్వామివారి దర్శనం కోసం క్యూలో భక్తులు


గర్భగుడిలో పూజలు అందుకుంటున్న లింగం


రథం ఊరేగింపు కోసం వేచి ఉన్న భక్తులు

హరహర మహాదేవ

● మార్మోగిన శివ నామస్మరణ ● భక్తులతో కిటకిట లాడిన ఆలయం ● రథోత్సవానికి మంగళహారతులతో ఘన స్వాగతం

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): హరహర మహాదేవ నామస్మరణతో నీలకంఠేశ్వర రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. ప్రతీఏటా రథసప్తమి పర్వదినాన భక్తులకు నీలకంఠేశ్వరస్వామి పార్వతీ సమేతంగా భక్తులకు దర్శణమిస్తాడు. సంక్రాంతి పర్వదినాన వైభవంగా పార్వతిని పెళ్లాడిన పరమేశ్వరుడు భక్తులకు దర్శనమివ్వడానికి రథసప్తమి నాడు రథంపై పురవీధుల గుండా ఊరేగడం ఆనవాయితీగా వస్తోంది. ఆ ఆనవాయితీని కొనసాగిస్తూ జిల్లాలో ప్రసిద్ధ శైవ విరాజిల్లుతున్న నీలకంఠేశ్వర స్వామి మంగళవారం ఘనంగా ఊరేగింపు నిర్వహించారు. ఆలయంలో ముందుగా శిఖరానికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయ సాంప్రదాయాన్ని అనుసరించి ఆలయం చుట్టు శిఖరాన్ని మేళతాలాలతో ప్రదక్షణగావించి రథంపై ప్రతిష్ఠించారు. భక్తుల హరహర మహాదేవ నామస్మరణలతో ఆలయ అర్చకులు మకరందశాఖాయ్, సుహాస్‌శాఖాయ్‌లు శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పూర్ణకుంభంతో స్వాగతం పలుకుతూ రథంపై ప్రతిష్ఠించారు. శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీరామ్‌రవీందర్‌గుప్త ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం నుంచి భక్తుల నామస్మరణతో రథోత్సవం బయలుదేరి తల్లిగోరి వరకు సాగింది. రథోత్సవానికి దారిపొడుగున భక్తులు రథాన్ని లాగుతూ కొబ్బరికాయలు, మంగళహారతులతో స్వాగతం పలికారు. నీలకంఠేశ్వర ఆలయ వీధులు శివ నామస్మరణతో మారుమోగాయి. రథోత్సవానికి ముందు మహిళలు కోలాటలు, భజన మండలి వారి భజనలతో సాగింది.

తల్లి గోరి వద్ద ప్రత్యేక పూజలు

నీలకంఠేశ్వరుడి రథోత్సవంలో ముఖ్య ఘట్టమైన తల్లిగోరి దర్శణం సంప్రదాయంగా సాగింది. రథోత్సవంపై శివపార్వతులు తల్లి గోరిని దర్శించుకుని ఆశీస్సులు అందజేశారు. ఆలయ అర్చకులు తల్లిగోరి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడంతో ఆ ప్రాంతమంతా శివనామస్మరణతో పర్వశించి పోయారు. ఆలయ మర్యాదలను అనుసరించి తల్లి గోరికి కానుకలు అందించి ప్రత్యేక పూజలు చేశారు.

నీలకంఠేశ్వరుడికి ఉట్టితో పూజలు

రథోత్సవంలో భాగంగా భక్తులు తమ కోరికలను నెరవేర్చాలని వేడుకుంటూ ఉట్టిపూజలు ప్రత్యేక ఆకర్షణగా నిలచాయి. రథానికి ఉట్టిలు కట్టడడంతో తమ కోరికలు నెరవేరుతాయని భక్తులు జిల్లా నలుమూలల నుంచి కాకుండా పక్కరాష్ట్రాల నుంచి వచ్చి కట్టడడం ఆనవాయితీగా వస్తోంది. భక్తులు వివిధ ప్రాంతాల నుంచి ఉట్టికట్టి తమ మొక్కులు తీర్చుకున్నారు.

నేడు శక్కర తీర్థం

నీలకంఠేశ్వరుడి రథోత్సవంలో భాగంగా బుధవారం శక్కర తీర్థాన్ని నిర్వహించనున్నారు. రథోత్సవంపై ఊరేగిన శివపార్వతులను ఆలయ ప్రాంగణంలోని కోనేరులో శక్కరతీర్థం కార్యక్రమాన్ని జరుపనున్నట్లు ఆలయ ఈవో శ్రీరాంరవీంద్రగుప్త తెలిపారు.


అదిగో చూడు తల్లీ స్వామివారి రథం


బందోబస్తులో పోలీసు అధికారులు, సిబ్బంది


రథం ఊరేగింపులో పాల్గొన్న భక్తులు


స్వామీ.. నా మొరను ఆలకించు..!

పాదయాత్రగా పండరీశుని సన్నిధికి

● వందల కిలోమీటర్ల మేర పాదయాత్ర ● జుక్కల్, బాన్సువాడ నియోజక వర్గాల నుంచి భక్తుల పయనం
● చిన్నారి మొదలుకుని వృద్దుల వరకు దర్శనానికి ● దిండి పేరిట సామూహిక పాదయాత్ర



పండరిపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

పెద్దకొడప్‌గల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): జుక్కల్ నియోజకవర్గం మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు సరిహద్దులో ఉండటంతో ఆ రాష్ట్రాల జీవన విధానం, భక్తి, కట్టుబొట్టు తీరు, నడవడిక ఇక్కడి ప్రజలపై ప్రతిబింబిస్తుంది. చాలా వరకు జుక్కల్ నియోజకవర్గ ప్రజలు తెలంగాణ పండుగలతోపాటు మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన పండుగలను కూడ జరుపుకుంటారు. దీంతో పాటుగానే భక్తిలో కూడా మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలలో నెలవై ఉన్న దేవుళ్లను పూజిస్తారు. ఈ కోవాలోనే ప్రతీ సంవత్సరం మాఘ మాసంలో దిండి పేరిట మహారాష్ట్రలో నెలువైఉన్న పండిరిపూర్ విఠలేశ్వరుని దర్శనానికి పాదయాత్రగా ఈ ప్రాంతం నుంచి వేల సంఖ్యలో భక్తులు పండరిపూర్ బయలుదేరుతారు. జనవరి 20 తర్వాత ప్రారంభమైన దిండి పాదయాత్ర వివిధ గ్రామాల నుంచి బయలుదేరి ఫిబ్రవరి 5 వరకు పండరీపూర్ చేరుకుంటుంది. ఈదిండి ద్వారా భక్తులు తెలంగాణలోని జుక్కల్, బాన్సువాడ, ఎల్లారెడ్డి నియోజకవర్గాలకు చెందిన భక్తులు సుమారు జుక్కల్ ప్రాంతం నుంచి 350 కిలోమీటర్ల దూరంలో ఉన్న విఠలేశ్వరుని దర్శనానికి పాదయాత్రగా చేరుకుంటారు. ప్రతీ సంవత్సరం గాంధారి మండలం ముదెల్లి, నిజాంసాగర్ మండలం మల్లూర్, బాన్సువాడ, సంగారెడ్డి జిల్లా అంతర్‌గాం గ్రామాల నుంచి దిండిలు వెలుతుండటంతో భక్తులు ఎవరికి నచ్చిన దిండిలో వారు వెళ్లి స్వామివారిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో వాహనాల ద్వారా తమ స్వగ్రామాలకు వస్తారు.

దిండి పేరుతో పాదయాత్ర

దిండి అంటే తెలంగాణ ప్రజలకు తెలియని పదం. మరాఠీ భాషలో దిండి అంటే అందకితో కలిసి సమిష్టిగా వెళ్లేది అని అర్థం. ఇలా విఠలేశ్వరుని దర్శనానికి మాఘవారీ, ఆషాఢ, కార్తీక, చైత్రవారి అనే పేర్లతో భక్తులు పండరిపూర్ పాదయాత్రగా వెళ్తారు. తెలంగాణ వారికి అందులో జుక్కల్ ప్రాంతం వారికి మాఘవారీ దిండి ఒక్కటే పరిచయం. దిండిగా వెల్లే పాదయాత్ర సమూహానికి ఆయా గ్రామాలకు చెందిన కీర్తన మహరాజ్‌లు లేదా పీఠాధిపతులు ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహిస్తారు. వందల కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్రలో చిన్నారుల మొదలుకుని వృద్దుల వరకు వెల్తారు. ఇలా వెల్లే భక్తులకు జుక్కల్ నియోజకవర్గం నుంచి మొదలుకుని పండరిపూర్ వెళ్లేంత వరకు దాతలే అన్నపానీయాలు, అల్పాహారాలు అందజేస్తారు. ప్రతీరోజు సుమారు 30 కిలోమీటర్ల మేర సాగే ఈ పాదయాత్ర ఫిబ్రవరి5 వరకు పండరిపూర్ చేరుకుంటుంది.

తులసీ కోటతో.. విచిత్ర వేషధారణతో..

విఠలేశ్వరునికి తులసీ అత్యంత ప్రియమైన భక్తురాలు కావడంతో ఆమెకు గుర్తుగా ఆయా గ్రామాల నుంచి మహిళలు తమవెంట తులసీ మొక్కను తీసుకెళ్తారు. గ్రామాల నుంచి సాగే పండరిపూర్ పాదయాత్ర సమూహంలో తప్పనిసరిగా తులసీకోట ఉంటుంది. దిండిలో గల మహిళలు తమ ఇళ్ల నుంచి తులసీ మొక్కను తమవెంట తీసుకెళ్తారు. వార్కారీ సాంప్రదాయంలో ప్రతీ నిత్యం తులసీ మొక్కకు పూజ తప్పనిసరి కావడంతో మహిళలు తమవెంట తులసీ కోటను తీసుకెళ్లి ప్రతీ ఉదయం పూజ నిర్వహిస్తారు. పండరిపూర్ చేరుకున్న పాదయాత్ర భక్తులు అక్కడ మూడు రోజుల పాటు ఉండి చంద్రభాగ నదిలో స్నానం చేసి విఠలేశ్వరుని ఏకాదశి రోజున దర్శించుకుని మరుసటి రోజున తమ గ్రామాలకు తిరుగు పయనమవుతారు.

వార్కారీ సాంప్రదాయంతో అడుగులు

పాండురంగని దర్శనానికి బయల్దేరే భక్తులు వార్కారీ సంప్రదాయం పాటిస్తూ దర్శనానికి బయల్దేరుతారు. తెల్లటి పంచె, ధోతి ధరించి తలపై టోపీ పెట్టుకుని పాదయాత్రలో పాల్గొంటారు. పాదయాత్ర చేసే సమయంలో నడక అలసట తెలియకుండ ఉండేందుకు విఠల విఠల విఠలా.. పాండురంగా విఠలా అని స్మరిస్తూ నడుస్తారు. అంతేగాకుండ దారి మధ్యలో ఆటలు ఆడుతూ, మహిళలు కోలాటం వేస్తూ ముందుకు సాగుతారు. ఇక వార్కారీ సాంప్రదాయం పాటించే వారు ప్రతీ రోజు ఉదయం కాకడ, అభంగాలు, ప్రవచనం, హరిపాఠ్, కీర్తనలు చేస్తూ ముందుకు సాగుతారు.

15 రోజులు.. 350 కిలోమీటర్లు..

తెలంగాణ ప్రాంతానికి చెందిన భక్తులు మహారాష్ట్రలోని పండరిపూర్ విఠలేశ్వరుని దర్శించుకునేందుకు 15 రోజుల పాటు 350 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేస్తారు. ప్రతీరోజు 25 నుంచి 30 కిలోమీటర్ల మేర పాదయాత్ర చేసి పండరిపూర్ చే రుకుంటారు. ఫిబ్రవరి 5 వరకు అక్కడకు చేరుకుని విఠలేశ్వరుని ఏకాదశి రోజున దర్శించుకుంటారు. గతంలో కొద్దిమందితో ప్రారంభమైన ఈపాదయాత్రలో ప్రస్తుతం వందల సంఖ్యలో భక్తులు వెళ్తుండటం విశేషం.

పాదయాత్రగా వెళ్తున్న భక్తుల సంఖ్య ప్రతీఏటా పెరుగుతోంది

● బాల్‌రాజ్ గౌడ్ ముదెల్లి మహరాజ్



మన ప్రాంతం మహారాష్ట్ర సరిహద్దులో ఉండటంతో మన ప్రాంతంలోని చాలామంది ప్రజలు విఠలేశ్వరున్ని పూజిస్తూ వార్కారీ జీవనం గడుపుతారు. గతంలో దిండి ద్వారా విఠలేశ్వరుని దర్శనానికి తక్కువ మంది భక్తులు వచ్చేవారు. అయితే ప్రతీ ఏటా పండరీపూర్‌కు పాదయాత్రగా వెళ్తున్నవారి సంఖ్య ప్రతీఏటా పెరుగుతోంది. స్వామి దర్శనం అనంతరం ఎవరికి తోచినవిధంగా వారు తిరిగి స్వగ్రామాలకు వాహనాల ద్వారా చేరుకుంటారు. నేను గత 16ఏళ్లుగా విఠలేశ్వరున్ని దర్శించుకుంటున్నా.


తులసీ కోటను మోసుకెళ్తున్న భక్తులు



పాదయాత్రలో విరామం తీసుకుంటున్న భక్తులు

రెండో రోజు ఎమ్మెల్సీ స్థానాలకు

మూడు నామినేషన్లు

● పట్టభద్రుల స్థానానికి రెండు, ఉపాధ్యాయుల స్థానానికి ఒకటి


ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు


ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి వేముల కరుణాకర్‌రెడ్డి

కరీంనగర్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్, నిజాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ స్థానాలకు రెండో రోజు మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. పట్టభద్రుల స్థానానికి ఇద్దరు, ఉపాధ్యాయ స్థానానికి ఒకరు ఎన్నికల అధికారి, కరీంనగర్ కలెక్టర్ పమేలా సత్పతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి వేముల కరుణాకర్‌రెడ్డి (తీగల ధర్మారం, ధర్మపురి), పిడిశెట్టి రాజు (వెంకటేశ్వరపల్లి, కోహెడ), టీచర్ ఎమ్మెల్సీ స్థానానికి తిరుమల్‌రెడ్డి ఇన్నారెడ్డి (మంచిర్యాల) నామినేషన్లను వేశారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి ఇప్పటి వరకు ఎనిమిది మంది, టీచర్ స్థానానికి నలుగురు మొత్తం 12 మంది 16 సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కార్యక్రమంలో డీఆర్వో వెంకటేశ్వర్లు, పవన్‌కుమార్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం


వేంపల్లిలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ముప్కాల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): రథపస్తమిని పురస్కరించుకొని మండలంలోని వేంపల్లిలో వేంకటేశ్వరస్వామి కల్యాణం గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో ఉత్సవ మూర్తులకు అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాధరణ, దేవత ఆహ్వానం, హోమం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భజభజంత్రిలతో శ్రీదేవి, భూదేవి సమేతంగా ముత్యాల తలంబ్రాలతో వెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణాలతో కన్నుల పండగగా జరిగింది. భక్తుల గోవిందనామాల స్మరణాలతో ఆలయంలో మార్మోగింది. ఉత్సవాల్లో భాగంగా ఆలయ పరిసరాల్లో పలు దుకాణాలు వెలిశాయి. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ అన్నిఏర్పాట్లు చేసింది. బుధవారం స్వామివారికి నాగవెళ్ళి, చక్రస్నానం, పూర్ణహుతి, బలిహరణం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో వేంపల్లిసొసైటీచైర్మన్ జక్క రాజేశ్వర్, ఆలయకమిటీ సభ్యులు, దేవాదాయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం

రెంజల్: మండలంలోని కళ్యాపూర్‌లో మంగళవారం రథసప్తమి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు మంగళ హారతులతో ఆలయానికి విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వేద పండితుల సమక్షంలో కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం రథసప్తమి సందర్భంగా వెంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామాభివృది కమిటీ అధ్యక్షులు నాగరాజు, ఉపాధ్యక్షుడు కిన్నెర మోహన్, ప్రధాన కార్యదర్శి శంకర్, కోశాధికారి బాలయ్య, కమిటీ సభ్యులు గంగాధర్, శ్రీనివాస్, విజయ్, ప్రవీణ్, పోతన్న, రాములు, రవి, అఖిల్ పాల్గొన్నారు.


స్వామి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

ముగియనున్న చైర్మన్ల పదవీ కాలం

● ఆందోళనలో సొసైటీ చైర్మన్లు



ప్రాథమిక సహకార సంఘం

మోపాల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):టెన్షన్ టెన్షన్‌లో ప్రాథమిక సహకార సంఘ చైర్మన్లు ఉన్నారు. ఈనెల 22తో ప్రాథమిక సహకార సంఘాల చైర్మన్‌ల పదవీకాలం ముగియనుంది. కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ పదవీకాలం పెంచుతుందో లేదోనని చర్చనీయాంశమైంది. లక్షల రూపాయలు పెట్టి చైర్మన్ పదవిని దక్కించుకున్న చైర్మన్‌లుగా ఎన్నికయ్యారు. ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యేంతవరకు పదవీకాలాన్ని మరింత పెంచుతదని ఆయా గ్రామాల చైర్మన్‌లు ఆశతో ఎదురు చూస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు ప్రాథమిక సహకార సంఘాల ఎన్నికలు కూడా ఒకే సమయంలో జరుగుతాయోనని ఎదురు చూస్తున్నారు. గతంలో చైర్మన్‌లకు పదవీకాలం పూర్తయినప్పటికీ ఆరు నెలల పాటు పదవీకాలాన్ని పెంచుతూ వచ్చిందని ఇప్పుడు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మరో ఆరు నెలలు లేదా సంవత్సరం కాలం పాటు పెంచుతుందని ధీమాతో చైర్మన్‌లు ఉన్నట్లు తెలుస్తుంది. ఈనెల 22తో చైర్మన్‌ల పదవీకాలం ముగియనుండటంతో పాలకవర్గాన్ని రద్దు చేస్తారని ఆయా గ్రామాల రైతులు చర్చించుకుంటున్నారు.

వరిసాగులో నీటిని ఆదా చేసుకునే

పద్ధతులను రైతులు అలవార్చుకోవాలి



రైతులకు ఏడబ్ల్యూడీ పైపులను అందజేస్తున్న ఫౌండేషన్ ప్రతినిధి

వేల్పూర్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వరిసాగులో నీటిని ఆదా చేసుకునే పద్ధతులను రైతులందరు అలవర్చుకోవాలని డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ ప్రతినిధి చింత శ్రీనివాస్, ఏవో శృతిలు రైతులకు సూచించారు. మంగళవారం వేల్పూర్ మండల కేంద్రంలోని రైతు వేదికలో వరి పంటలో నీటి యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవోశృతి మాట్లాడుతూ డాక్టర్ రెడ్డిస్ ఫౌండేషన్ నిర్వహించే కార్యక్రమాలను రైతులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ డీఎస్ఆర్ పద్ధతి, తడిపొడి విధానం, డ్రమ్‌సీడర్ పద్ధతిపై రైతులకు అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో ఏవో శృతి, ఏఈవోలు తిరుమల, సాయిరాంరాజ్, ప్రశాంత్; స్నేహశ్రీ, షబ్బీర్, ఫౌండేషన్ కమ్యూనిటీ కోఆర్డినేటర్ చింత శ్రీనివాస్, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులపై సామాజిక తనిఖీ

ధర్పల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఐకెపీ కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 15వ విడత సామాజిక తనిఖీని మంగళవారం నిర్వహించారు. ఈకార్యక్రమానికి డీఆర్‌డీవో సాయాగౌడ్, ప్రీసైడింగ్ అధికారి వ్యవహరించారు. గత ఏడాది మండలంలోని 22గ్రామాల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. పనులపై తనిఖీ నిర్వహించగా ఉపాధి హామీ సిబ్బంది పని ప్రదేశంలో కొలతల్లో తేడాలు, మాస్టర్ల నిర్వహణలో తప్పిదాలను ఉపాధి హామీ సామాజిక బృందం గుర్తించారు.ఈ కార్యక్రమంలోల జిల్లా విజిలెన్స్ అధికారి నారాయణ, ఎంపీడీవో బాలకృష్ణ, ఎంపీవో, ఏపీవో , పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవీపేట,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని ట్రాన్స్‌కో ఏడీఈ ప్రశాంత్ రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ మరమ్మత్తులో భాగంగా ఉదయం 11గంటల నుండి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని, ఈ విషయంలో వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బోధన్‌రూరల్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): మంజీర సరిహద్దు గ్రామాల ప్రాంతాల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మందర్నా గ్రామం నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేయడం జరిగిందన్నారు. అనుమతులు ఉన్న వారే ఇసుక రవాణా చేయాలన్నారు. లేనియెడల చట్టరీత్యా చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు.

20ట్రాక్టర్ల ఇసుక సీజ్

రెంజల్: మండలంలోని నీలా గ్రామ శివారులోని హంగర్గ రోడ్డు వద్ద అక్రమంగా డంప్ చేసిన సుమారు 20ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్ కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక పోలీసులు రెవెన్యూ సిబ్బందితో కలిసి ఇసుక డంప్ వద్దకు చేరుకుని ఇసుకను సీజ్ చేయడం జరిగిందని, సీజ్ చేసిన ఇసుకను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ రవి కుమార్, జూనియర్ అసిస్టెంట్ గౌతం తదితరులున్నారు.

న్యావనంది పాఠశాల తనిఖీ

సిరికొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):సిరికొండ మండలం న్యావనంది హైస్కూల్‌ను తహశీల్దార్ రవీందర్‌రావు మంగళవారం తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం ఎలా ఉంది, వంటలు బాగా చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించేలా తీర్చిదిద్దాలని కోరారు.

ఆశాకార్యకర్తలపై అధికారులు వేధింపులు మానుకోవాలి

సిరికొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):ఆశావర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిరికొండ మెడికల్ అధికారికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహన్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిబ్రవరి నుంచి జిల్లా వ్యాప్తంగా లెప్రసీ వ్యాధిపై సర్వే చేయాలని ఆశా కార్యకర్తలకు జిల్లా అధికారులు చెబుతున్నారని ఆమె అన్నారు.ఈకార్యక్రమంలో ఆశావర్కర్ యూనియన్ నాయకులు రాధా, సువర్ణ, లక్ష్మీ, గంగామణి, విజయ, మోహన్, మల్యాల సుమన్, నాగుల గోవర్ధన్, రేవతి, గంగామణి పాల్గొన్నారు.

ప్రధాని, కేంద్రమంత్రి దిష్టిబొమ్మ దహనం

వేల్పూర్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపి నిధుల కేటాయింపులో తీవ్ర అన్యాయం చేయడం పట్ల నిరసనగా మంగళవారం వేల్పూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. అంతకు ముందు వారి దిష్టిబొమ్మతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా శవయాత్ర నిర్వహించి అంబేద్కర్‌చౌరస్తా వద్ద దహనం చేశారు.ఈకార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మండల అధ్యక్షుడు నర్సారెడ్డి, మండల మహిళ అధ్యక్షురాలు స్వరూప, నాయకులు దామోదర్, రాజేందర్, నరేందర్, వినోద, జెమ్స్, రాము, భగవన్‌దాస్, రవి, మహేందర్, రమేష్, జాన్, సురేష్, చిన్నయ్య, మల్లేస్, గంగయ్య, చరణ్, ఇంద్రగౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు, పాల్గొన్నారు.

ఇందూరు తిరుమలలో ఘనంగా రథసప్తమి

మోపాల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామంలో ఉన్న ఇందూరు తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందూరు తిరుమల ఆలయ ప్రాంగణంలోని వనమాల క్షేత్రంలో సూర్యప్రభ వాహనంపై వెంకటేశ్వరస్వామి ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు రోహిత్ కుమార్ ఆచార్య, విజయస్వామి, రాజేశ్వర్, భూంరెడ్డి, గ్రామస్థులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు.

భీమ్‌గల్: పట్టణంలోని శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాలో మంగవారం రథసప్తమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీఏడాది మాఘమాసంలో శుక్లపక్షం రోజున రథసప్తమి పంగను నిర్వహిస్తారు. భూమిపై ఉన్న సమస్త జీవరాసులు సుభిక్షంగా ఉన్నాయంటే దానికి కారణం సూర్యుడే కనిపించే దేవుడని అంటారని పాఠశాలలో రథసప్తమి పండగ యొక్క విశిష్టతను విద్యార్థులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఆచార్యులు రాస రవికుమార్, జి.నర్సారెడ్డి, పీఈటీలు ఎస్.నరేష్, గంగాధర్, సుమలత, అధ్యాపకులు వై.చంద్రశేఖర్, రాజేందర్, వినోద్‌కుమార్; మాతాజీలు ఎం.మాదవి, శ్రీవాణి, స్వర్ణ, విద్య, సంధ్య, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

బోధన్‌రూరల్: బోధన్ పట్టణంలోని రాకాసిపేట ప్రాంతంలో గల ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రథ సప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాఘమాస శుద్ధ సప్తమి సందర్భంగా ఆలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య రథ సప్తమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్య భగవానుడి యొక్క విశిష్టతను వివరించారు. ప్రతి రోజు హిందువులు ఆలయ ప్రదక్షిణ చేయాలని, కోరిన కోర్కెలు నెరవేరుతాయని ఈ సందర్భంగా ఆయన భక్తులకు వివరించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు తోకల సాయన్న, పోశెట్టి, సంతోష్ గౌడ్, ఏశాల రవీందర్, బిళ్ల శంకర్, వేద పండితులు రాచప్ప మహరాజ్, అర్చకులు శివప్ప, రామప్ప, వినోద్, తదితరులున్నారు.



ఇందూరు తిరుమలలో శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

విద్యుత్ శాఖ అధికారులతో ఎస్‌ఈ సమీక్ష

సుభాష్‌నగర్, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):వేసవికాలంలో విద్యుత్ నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని టీజీఎన్‌పీడీసీఎల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ రవీందర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పవర్‌హౌజ్ భవనంలో జిల్లా విద్యుత్ శాఖ అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అంతరాయం జరుగకుండా విద్యుత్‌ను వినియోగదారులకు అందజేయడానికి కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 6కోట్ల వ్యయంతో 6 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ.13.1 కోట్లతో 33కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. రూ.6.47 కోట్లతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ స్థాయిని పెంచడం, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో అధికలోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను బిగించడం జరిగిందన్నారు. జరుగుతున్న పనులను సైతం వేగవంతం చేసి ఫిబ్రవరి చివరిలోపు పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్ష సమావేశంలో ఎస్ఏవో శ్రీనివాస్, డీఈలు రమేష్, రాజేశ్వర్‌రావు, శ్రీనివాస్, ఉత్తమ్, ముక్తార్, వెంకటరమణ, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఈ రవీందర్ (ఇన్‌సెట్), హాజరైన అధికారులు

ఎమ్మార్పీఎస్ నాయకుల డప్పులు వితరణ



ఎమ్మార్పీఎస్ నాయకులకు డప్పులను వితరణ అందజేస్తున్నగోర్త రాజేందర్

జక్రాన్‌పల్లి, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): వేల గొంతులు, లక్ష డప్పులు సంస్కృతిక మహాప్రదర్శనను విజయవంతం చేయాలని కోరుతూ మంగళవారం మండలంలోని అర్గుల్ గ్రామంలో అన్ని గ్రామాల మాదిగ కుల సంఘ సభ్యులకు 80డప్పులను మాజీసర్పంచ్‌ల ఫోరం జిల్లా అధ్యక్షుడు గోర్త రాజేందర్ అందజేశారు. హైదరాబాద్‌లో ఈనెల 7న జరగనున్న వేల గొంతులు, లక్షడప్పులు కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈ డప్పులను అందజేసినట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు మద్దతు తెలుపుతున్నట్టు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కనక ప్రమోద్, మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వరుణ్, ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు నల్ల సాయన్న, ఎంఎస్ఎఫ్ జిల్లాకన్వీనర్ కనక శ్రీదీప్, ఎమ్మార్పీఎస్ నాయకులు తదిత రులు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి:ఎస్సీవర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న జరిగే మహాప్రదర్శన కార్యక్రమం జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ మండ ల అధ్యక్షుడు, సంపత్, వర్సిటీ అధ్యక్షుడు దినేశ్ లు పిలుపునిచ్చారు. మంగళవారం తెలంగాణ వర్సిటీ కళా శాల వద్ద లక్షల డప్పులు వేల గొంతులు పోస్టర్ లు ఆవిష్కరణ అనంతరం వారు విలేకర్లతో మాట్లాడుతూ.. హైదరాబాద్ ఎల్బీ స్టేడియం నుంచి పెద్ద అంబేడ్కర్ విగ్రహం వరకు జరిగే మహాప్రదర్శనకు లక్షలాదిగా మాదిగాలు తరలిరావలని కోరారు. వర్గీకరణ లక్ష్యంగా 30ఏళ్లు గా రాజీలేని పోరాటం చేస్తున్న మందకృష్ణ మాదిగా ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాన్ని విజయవం తం చేయన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెఎస్ఎఫ్ నాయకులు సైమన్‌పాల్, నవదీప్, చక్రి, నరేశ్, పాల్గొన్నారు.

యోగాసానాలతో సూర్య ఆరాధన

నిజామాబాద్ కల్చరల్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యక్ష దైవమైన సూర్యభగవానుడికి యోగాసనాలతో విద్యార్థులు ఆరాధన చేశారు. మంగళవారం నగరంలోని శివాజీనగర్‌లో విద్యార్థులు సూర్యన మస్కారాలతో సూర్యుడిని పూజించారు. ఈ కార్యక్రమంలో మధుసూదనాచార్య, లక్ష్మీప్రియ, రేణుక, సంధ్య, సునీత, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

దేశానికి క్యాన్సర్ పెను సవాలుగా మారింది

● ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్




సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ రోహిత్

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి):సర్వేకల్ క్యాన్సర్ దేశానికి ముఖ్యమైన ప్రజారోగ్య సవాల్‌గా మారనున్నదని దీన్ని నివారించేందుకు ప్రభుత్వం, సామాజిక సేవా కార్యకర్తలు కృషి చేయాలని ప్రముఖ ఆంకాలజిస్ట్ డాక్టర్ రోహిత్ అన్నారు. వరల్డ్ క్యాన్సర్ డే సందర్భంగా దాస్‌నగర్‌లోని మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో మల్లుస్వరాజ్యం మెమోరియల్ ట్రస్ట్, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన క్యాన్సర్ అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్యాన్సర్ నివారణకు ప్రభుత్వం మౌళిక సదుపాయాలు కల్పించాలని, మందుల ధరలను నియంతించాలని అప్పుడే క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. జనవిజ్ఞాన వేదిక జాతీయ అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ తాను క్యాన్సర్‌ను జయించానని ముందుగా గుర్తించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చన్నారు. మహిళలలో బ్రెస్ట్ క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్‌లు ప్రమాదకరంగా మారాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవీంద్రనాథ్ సూరి, కళాశాల ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, రామ్మోహన్‌రావు, మదన్‌మోహన్, తదితరులు పాల్గొన్నారు.

● పడిగెలలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో వరల్డ్ క్యాన్సర్ డే కార్యక్రమం

వేల్పూర్: వేల్పూర్ మండలం పడిగెల గ్రామంలో లయ న్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ నవనాథపురం ఆధ్వర్యంలో మంగళవారం వరల్డ్ క్యాన్సర్ డే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాన్సర్‌ను జయించిన స్థానిక మాజీఎం పీటీసీ వెల్మల గంగామణిని లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్ శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ ను జయించి క్యాన్సర్ రోగులకు ధైర్యం చెబుతూ మహిళలకు గంగామణి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆర్మూర్ అధ్యక్షుడు చెరుకు పృథ్వీరాజ్, కోశాధికారి నారాయణగౌడ్, సభ్యులు చెన్న రవి, విజయానంద్, ఐఎన్‌టీ యుసీ సెక్రెటరీ మీసాల సురేష్‌కుమార్, దయాల్‌సింగ్, పుణ్యరాజ్, రమాగౌడ్, తదితరులు పాల్గొన్నారు.



పడిగెలలో క్యాన్సర్‌ను జయించిన మహిళ

నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ

నందిపేట, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న నాలుగు ప్రైవేట్ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు మండల విద్యాధికారి అవదూత గంగాధర్ తెలిపారు. జాతీయ నూలి పురుగుల దినోత్సవం సందర్భంగా మండల విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓరియంటేషన్ సమావేశం నిర్వహించామని ఎంఈవో చెప్పారు. ఈ సమావేశానికి హజరు కాని మండలంలోని వెల్మల్ గ్రామంలో ఉన్న అక్షరదామ్, శ్రీ మంజునాథ, శ్రీశారద విద్యానికేతన్, తల్వేదలోని భారతి విద్యానికేతన్ అనే ప్రైవేట్ పాఠశాలకు నోటీసులు ఇచ్చామని, తక్షణమే రాతపూర్వకంగా వివరణ ఇవ్వాలని ఆదేశించడమైనదని మండల విద్యాధికారి అవదూత గంగాధర్ పేర్కొన్నారు.

ముందస్తుగా మాజీ సర్పంచ్‌ల అరెస్టు

సిరికొండ, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీలకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన సర్పంచులను సిరికొండ మండలంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మండలంలోని ఒక్కొక్క గ్రామ పంచాయతీకి లక్షల రూపాయలు విడుదల కావాల్సి ఉందని కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన వాటిని విడుదల చేయకపోవడం విడ్డూరంగా ఉందని సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రమేష్ అన్నారు. నిధుల విడుదల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న తమను అరెస్టు చేయడం బాధాకరమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే గ్రామ పంచాయతీలకు విడుదల కావాల్సిన డబ్బులను మంజూరు చేయాలని ఆయన కోరారు. అరెస్టు అయిన వారిలో సిరికొండ, పెద్దవాల్గోట్, న్యావనంది, కొండూరు, చిన్నవాల్గోట్ సర్పంచులు గంగాదాస్, రాజారెడ్డి, నర్సారెడ్డి, శ్రీనివాస్, రాజు, తోటరాజన్న, హేమంత్ తదితరులు ఉన్నారు.

బోధన్‌రూరల్: మాజీ సర్పంచ్‌లను ముందస్తుగా అరెస్టు చేయడం సరికాదని బోధన్ మండల మాజీ సర్పంచ్‌లు అన్నారు. మంగళవారం పెండింగ్ బిల్లుల కోసం హైదరాబాద్‌కు సన్నద్ధమవ్వగా సాలూర, బోధన్ మండలాల సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్టు చేయడం సరికాదని వారు పేర్కొన్నారు. ఏడాది కాలంగా బిల్లుల ఊసే లేదని, గ్రామాలను అభివృద్ధి చేసి జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డులు పొందిన గ్రామ పంచాయతీలు కూడా ఉన్నాయన్నారు. సర్పంచ్‌లకు రావాల్సిన పెండింగ్ బిల్లులను విడుదల చేసి అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు తదితరులున్నారు.

ఆర్మూర్‌రూరల్: ఆర్మూర్ మండలానికి చెందిన బీఆర్ఎస్ తాజామాజీ సర్పంచ్‌లను మంగళవారం ఉదయం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పెండింగ్‌లో ఉన్న సర్పంచ్‌ల బిల్లులు చెల్లించాలని హైదరాబాద్ అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా అడ్డుకోవడంలో భాగంగా మాజీసర్పంచ్ లను అరెస్టు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో మాజీసర్పంచ్‌లు కిశోర్ రెడ్డి, మోహన్‌రెడ్డి, దయానంద్, దేగాం గంగారెడ్డి, పిప్రి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



పోలీసులు అరెస్టు చేసిన మాజీ సర్పంచ్‌లు

సంక్షిప్త సమాచారం

వీఆర్ఏల ముందస్తు అరెస్టు



ముందస్తు అరెస్టు అయిన వీఆర్ఏలు

ఆర్మూర్‌టౌన్, ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక పోలీసులు మంగళవారం వీఆర్ఏల ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపు మేరకు వీఆర్ఏల డిమాండ్‌లు సాధించుకోవడానికి చలో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న వీఆర్ఏలను స్థానిక పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు. అరెస్టు అయిన వీఆర్ఏలకు మందిగ సంఘాల యునైటెడ్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు కొక్కెర భూమన్న మద్దతు తెలిపారు.

డిచ్‌పల్లి: రాష్ట్ర వ్యాప్తంగా వీఆర్ఏల జేఏసీ ఆధ్వర్యంలో వేలాదిగా తరలివచ్చిన వీఆర్ఏలు మినిస్టర్ క్వార్టర్స్ ముట్టడికి యత్నించారు మంగళవారం డిచ్‌పల్లి నుంచి బయలుదేరిన వీఆర్ఏలను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. రోడ్డు పై బైటాయించి ఆందోళన చేశారు. 61ఏళ్లు పైబడిని వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు ఇవ్వాలని జీవో నంబర్ 81,85 నంబర్ ప్రకారం ఉద్యోగాల ప్రకటన చేయలని డిమాండ్ చేశారు.ఈఆందోళనలో డిచ్‌పల్లి వీఆర్ ఏలు సురేశ్, గంగాధర్, అబ్బుల్ల, రవి, భూమవ్వ, ఉన్నారు.

పీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

పెర్కిట్,ఫిబ్రవరి4(ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్‌చౌరస్తా వద్ద మంగళవారం బీజేపీ నాయకులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ పార్టీ ఆర్మూర్ పట్టణ శాఖ అధ్యక్షుడు మందుల బాలు, సీనియర్ నాయకులు కలిగోట గంగాధర్, జిల్లా రైతు నాయకులు నూతుల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ సకల జనులకు ఆమోదయోగ్యమైన బడ్జెట్‌ను అందించినందుకు గాను ఆర్మూర్ పట్టణ ప్రజలు తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీమున్సిపల్ చైర్మన్ కంచెట్టి గంగాధర్, యామాద్రిబాస్కర్, ఆకుల శీను, జెస్సు అనిల్, పొల్కం వేణు, బొట్ల విజయ్, కలిగోట ప్రశాంత్, బ్యావత్ సాయికుమార్, శీను, ఉదయ్, శేషగిరి, లింగం, దొండి ప్రకాష్, బూత్ అధ్యక్షుడు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ:ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు మంగళవారం సిరికొండలో బీజేపీ నాయకులు పాలాభిషేకం చేశారు. ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద మధ్యతరగతి ప్రజలకు అనుకూలంగా ఉందని నరేంద్రమోదీ దేశ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో భాగంగా బడ్జెట్‌ను ప్రవేశపెట్టారని బీజేపీ నాయకులు మాట్లాడారు. కార్యక్రమంలో రాజేశ్వర్, రాజేశ్వర్‌రెడ్డి, సంజీవ్‌రెడ్డి, రామస్వామి, శ్రీనివాస్, మారుతి, బాబురావు, గోపి, శంకర్,పాల్గొన్నారు.

బాధితులకు సెల్‌ఫోన్లు అప్పగింత

ఖిల్లా, ఫిబ్రవరి 4(ఆంధ్రజ్యోతి):వివిధ కారణాలతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్లను గుర్తించి వాటిని మంగళవారం బాధితులకు అప్పగించినట్లు ఆరవ టౌన్ ఎస్ఐ వెంకట్రావ్ తెలిపారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు ఫిర్యాదు చేయగా ఫిర్యాదును నమోదు చేసుకుని సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించినట్లు చెప్పారు. సెల్‌ఫోన్లు గుర్తించడంలో నైపుణ్యత చూపిన మహిళ కానిస్టేబుల్ యాస్మీన్‌ను అభినందించారు.

ఆరో తరగతి ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 4 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశం కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఉపాధ్యాయులు తెలిపారు.

చికెన్ ధరలు

రకం	: లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	: రూ.180	రూ.250	రూ. 270
వెన్‌కాబ్(కిలో)	: రూ.190	రూ.260	రూ. 280

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.85,300	రూ.78,700	రూ.980

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్.. వేణుమాల్

స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (10.30, 1.30, 4.30, 7.30, 10.30)
స్క్రీన్-2 : మద గజ రాజ (10.10, 10.45)
: డాకు మహారాజ్ (1.20, 7.40)
: దేవ (హిందీ) (4.25)
స్క్రీన్-3 : దేవ (హిందీ) (10.45, 7.15, 10.30)
: మహిష (2.00)
: రొమాంటిక్ లైఫ్ (4.30)
స్క్రీన్-4 : ఏజెంట్ గయ్ 001 (11.15)
: స్కై ఫోర్స్ (హిందీ) (1.30, 10.25)
: మద గజ రాజ (4.15)
: ప్రేమిస్తావా (7.25)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్
స్క్రీన్-1 : సంక్రాంతికి వస్తున్నాం (11.00, 1.40, 4.40, 7.25, 10.00)
స్క్రీన్-2 : ఏజెంట్ గయ్ 001 (11.00, 4.40)
: మద గజ రాజ (1.30, 7.30, 10.20)

దేవి : డాకు మహారాజ్ (11.15, 2.15, 6.15, 9.15)
నటరాజ్ : రాచరికం (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : సంక్రాంతికి వస్తున్నాం (11.15, 2.15, 6.15, 9.15)
లలితామహల్ : మద గజ రాజ (11.30, 2.30, 6.30, 9.30)

- నిజామాబాద్ అర్బన్